కథా కౌముది



# రవి మావయ్య

మధురవాణి

ఆ వేళ బళ్ళో మాకు చివరి పరీక్ష. దీంతో నా ఐదో తరగతీ, బాబిగాడి మూడో తరగతీ అయిపోతుందన్నమాట! ఎంచక్కా రెణ్ణెళ్ళ పాటు వేసవి సెలవులు. బడీ ఉండదు, చదువూ ఉండదు. ఇహ రోజంతా ఇష్టమొచ్చినట్టు ఆటా పాటానే! ఆ హుషారులో సాయంకాలం బడి నుంచి ఇంటికొచ్చేసరికి అమ్మ మా ఇద్దరికీ మరో హుషారైన వార్త చెప్పింది. అదేంటంటే, ఊరు నుంచి మా రవి మావయ్య వస్తున్నాడంట! అబ్బ.. ఎంత సంతోషమేసిందనీ నాకూ, బాబిగాడికీ కూడా.

అసలైతే మా ఊర్లోనే మాకు సొంతంగా ఇద్దరు మావయ్యలున్నా గానీ మాకు మా రవి మావయ్యంటేనే ఎక్కువిష్టం. ఎందుకంటే మా పెద్దమావయ్యతో అసలు పిల్లలెవరూ మాట్టాడే ధైర్యమే చెయ్యరు. మా చిన్న మావయ్యేమో అస్తమానూ చదువు గురించి ఆరా తీస్తూ భయపెట్టిస్తుంటాడు. అదే మా రవి మావయ్య అయితేనా.. ఎంచక్కా చాక్లెట్లు, బిస్కెట్లు కొనివ్వడం, సరదా మాటలు చెప్పి నవ్వించడం, ఎత్తుకుని గిరగిరా తిప్పడం లాంటివన్నీ చేస్తూ మాతో కలిసిపోయి భలేగా ఆడుకుంటుంటాడులే. అందుకని బోలెడు సార్లు అనుకునే వాళ్ళం నేనూ బాబిగాడూ సావిత్రమ్మమ్మా, రవి మావయ్య కూడా మనూర్లోనే ఉంటే ఎంత బాగుండేదోనని. కానీ, వాళ్ళేమో అక్కడెక్కడో చాలా దూరం ఊర్లో ఉంటారు. అప్పుడెప్పుడో నా చిన్నప్పుడు అంటే, నేను నాలుగో క్లాసులోకొచ్చినప్పుడు మేవందరం కలిసి రవి మావయ్య వాళ్ళూరెళ్ళాంగా తన పెళ్ళికి. అప్పుడు తెలిసింది ఎంత దూరం అని. అందుకే ఎప్పుడో గానీ అమ్మమ్మా, మావయ్యా రారు మా దగ్గరికి.

మరుసటి రోజు తెల్లారి నాకు మెలకువొచ్చి నిద్దర లేచేప్పటికి ఇంటెనకాల మా ఇద్దరి మంచాలే మిగిలాయి. బాబిగాడు ఇంకా ముసుగుతన్నే ఉన్నాడు. చుట్టూ ఎవ్వరి మంచాలూ లేవు. యీ వేళ నుంచి ఇహ బడికెళ్ళక్కర్లేదని గుర్తొచ్చేసరికి ఎంత సంతోషమేసిందో!

ఇంతలో అమ్మా, అమ్మమ్మ, నాన్న మాటలతో పాటు ఎవరిదో కొత్త గొంతు వినిపిస్తోంది. అటేపు తిరిగి చూస్తే ఇంకేవుందీ.. పందిరి కింద అమ్మమ్మ బల్ల మీద కూర్చుని టీ తాగుతూ అమ్మావాళ్ళతో మాట్టాడుతున్న రవి మావయ్య కనిపించాడు. ఒక్క ఉదుటున మంచం మీంచి లేచి, క్షణంలో బాబిగాడి దుప్పటి లాగేసి, బోర్లా పడుకున్న వాడి వీపు మీద ఓ చరుపు చరిసి "ఒరే.. రవి మావయ్య ఒచ్చాడోయ్ ఊర్లోంచీ.." అని ఓ గావు కేక పెట్టి.. వాడు లేచే లోగానే నేను తుర్రున పరిగెత్తాను మావయ్య ఒళ్ళోకి.

ఎప్పట్లాగే మావయ్య నవ్వుతూ నన్నెత్తుకుని గాల్లో గిర గిరా తిప్పాడు. ఇంతట్లోకి బాబిగాడు కూడా లేచొచ్చాడు. మా ఇద్దర్నీ ఎత్తుకుని అలా తిప్పుతుంటే అమ్మేమో మమ్మల్ని కోప్పడింది "ఇప్పుడే కదా మావయ్య ఊర్లోంచొచ్చింది. అప్పుడే ఇద్దరూ మీద పడి తొక్కేస్తున్నారు కోతుల్లా.." అంటూ. "ఏం పర్లేదులే అక్కాయ్.." అంటూ సర్ది చెప్పాడు మావయ్య. అయినా రవి మావయ్యొచ్చాక అమ్మంటే మాకెందుకింక భయం. మావయ్య మా మీద ఒక్క మాట కూడా పడనీయడుగా!

ఇహ ఆ వేళ మొదలు వరుసబెట్టి నాలుగైదు రోజులు ఒహటే కబుర్లూ, అల్లరీ.. నేనూ, బాబిగాడూ మావయ్యతో కలిసి. అమ్మమ్మేమో వాళ్ళ చిన్నప్పటి కబుర్లన్నీ చెప్పేది మా అందరికీ. వాళ్ళ చెల్లీ, తనూ చిన్నప్పుడెలా ఉండేవాళ్ళూ, రవి మావయ్యని చిన్నప్పుడు కొన్ని రోజులు చదూకోడానికి ఇక్కడికి పంపించడం, అప్పుడు మావయ్య చేసిన 'దొంగోటు వేయడం'లాంటి అల్లరి పనులూ.. ఒకటేవిటీ అన్నీ పూస గుచ్చినట్టు చెప్పేది అమ్మమ్మ. చిన్నప్పుడంతా ఎప్పుడూ పెద్దమ్మ పెద్దమ్మా అని తన చుట్టూనే తిరిగేవాట్ట మావయ్య. రవి మావయ్య వాళ్ళమ్మకి తను ఒక్కడే కావడం మూలాన అమ్మన్నా, మావయ్యలన్నా తనకి ఎంతిష్టమో అని అమ్మమ్మ చెపుతూండేది.

అలా ఇలా రోజులు క్షణాల్లా దొర్లిపోయి మావయ్య మళ్ళీ తిరిగి ఊరెళ్ళే రోజు రానే వచ్చింది. నేనూ, బాబిగాడూ మొహాలు వేలాడేసుకుని కూర్చున్నాం ఆ వేళ పొద్దున్నించీ. "మాకింకా బోల్డు రోజులు ఎండాకాలం సెలవులున్నాయ్. అప్పటిదాకా నువ్వు మాతోనే ఉండకూడదూ!" అని మావయ్యని చాలా బతిమిలాడాం. మావయ్యేమో తను వెళ్ళకపోతే అక్కడ పనులన్నీ నిలిచిపోతాయ్ అన్నాడు. పోనీ మా ఇద్దరినీ తనతోపాటే తీసుకువెళతానన్నాడు.

నేనూ బాబిగాడూ ఎగ్గిరి గంతేసి వెంటనే మావయ్యతో కలిసి అమ్మనీ, అమ్మమ్మనీ ఎలాగో ఒప్పించాం. ఇహ చివరాఖరికి నాన్న పర్మిషనే మిగిలింది. మావయ్య వెనకాల దాక్కుని మెల్లగా ఇంటెనకాల గెడ్డం గీసుకుంటూ కూర్చున్న నాన్న దగ్గరికెళ్ళాం.

"బావా.. పిల్లలిద్దరికీ యీ రెండునెల్లూ సెలవలే కదా. నాతో పాటు ఊరికి తీస్కెళ్ళి ఓ ఇరవై రోజులు పోయాక నేనే మళ్ళీ తీసుకొచ్చి దింపుతాను" అనడిగాడు.

ఓ నిమిషమాగాక "సర్లేరా.. ఎండల్లో పిల్లలు జాగ్రత్త మరి. నేనాఫీసుకి వెళ్ళేప్పుడు రాత్రి బస్సుకి టిక్కెట్లు రిజర్వేషన్ చేయిస్తాన్లే" అన్నారు నాన్న.

వాళ్ళు కూడా లేకుండా ఎప్పుడూ ఎక్కడికీ మమ్మల్ని పంపించని నాన్న మా ప్రయాణానికి ఒప్పుకునేసరికి మా ఆనందానికి అంతే లేదు. ఇహ అప్పుడు చూడాలి మా ఇద్దరి గంతులు. ఇహ ఆ రోజంతా బ్యాగు సర్దుకోడమే సరిపోయింది మాకు.

మేం ఊరికి తీస్కెళ్ళడం కోసం అమ్మమ్మ చేసిచ్చిన జంతికలూ, అప్పచ్చులూ కూడా సర్దుకుని రాత్రికి బస్సెక్కి నిదరోతే తెల్లారి లేచేప్పటికి ఒక ఊరొచ్చింది. అక్కడి నుంచి మళ్ళీ ఇంకో బస్సెక్కి ఆ రోజు మధ్యాహ్నానికి ఐసరబజ్జా అనుకుంటూ మావయ్యా వాళ్ళ ఇల్లు చేరాం.

ఊర్నుంచి మావయ్యతో పాటు మేవిద్దరం కూడా వచ్చినందుకు సావిత్రమ్మమ్మా, రాధత్తయ్యా ఎంత ఆనందపడ్డారో! ఇంకా వాళ్ళ బుజ్జోడు ఎంత బాగున్నాడో! వాడి పేరు చందూ. చందూకి ఇంకా సరిగ్గా నడవడం, మాటలు పలకడం రాదు.

మావయ్యా వాళ్ళింట్లో ఉన్నప్పుడు ఎంత బాగుండేదో! పొద్దున్నే ఎప్పుడో ఏ ఏడు దాటాకో మెలకువొచ్చినప్పుడు నిద్దర లేవడం. లేచి మొహాలు కడిగేసరికి అత్తయ్య వేడి వేడి టిఫిన్లు చేసి పెడితే మెక్కి కాసేపు చందూ గాడితో ఆడుకోడం. ఆ తరువాత మావయ్యేమో బయటికెళ్ళిపోతాడు. మేవందరం స్నానాలు కానిచ్చి మళ్ళీ ఆడుకోడమే ఇంక.

మావయ్యా వాళ్ళది కూడా మా ఊరులాగే పల్లెటూరే. వాళ్ళూర్లో మావయ్యా వాళ్ళే నడిపే ఓ రైసు మిల్లుంది. అమ్మమ్మ రోజూ అక్కడికెళుతుంది పనులు చూడ్డానికి. మేవిద్దరం కూడా రోజూ అమ్మమ్మతో పాటు మిల్లుకి వెళ్ళేవాళ్ళం. ఆ మిల్లులో ఓ మిషనులోంచి కాఫీ రంగులో బియ్యం పడుతూ ఉండేవి. వాటినే మనం తినే తెల్ల బియ్యంగా మారుస్తారని అమ్మమ్మ చెప్పింది. మిల్లులో ఉండే పెద్ద బియ్యం కుప్పలోనూ, మిల్లు వెనకాల ఉండే ఊకలోనూ ఆడుకునేవాళ్ళం నేనూ బాబిగాడూ.

ఆ మిల్లునానుకుని ఓ చిన్న హోటలు ఉండేది. అక్కడ మైసూరు బజ్జీలు తినిపించింది అమ్మమ్మ ఓసారి. అదే మొదటి సారి నేనవి తినడం. నాకెంత నచ్చాయంటే రోజూ అవే కావాలని అడిగేదాన్ని అమ్మమ్మని. నా గోల చూసి అమ్మమ్మ నా కోసం ఇంట్లో టిఫిను కూడా అవే చేసి పెట్టేది.

ఇంకా ఆ హోటలు ఎదురుగా వీధికావలి పక్కన ఓ బడ్డీకొట్టు ఉండేది. అందులో ఆ బడ్డీ కొట్టు యజమాని దంపతులిద్దరూ కూర్చుని ఉండేవారు. ఇప్పటికీ నాకెంతో ఇష్టమైన నిమ్మకాయ షోడా రుచి నాకు మొదటిసారి పరిచయమయ్యింది ఆ బడ్డీకొట్లోనే.

మిల్లెదురుగా ఉండే ఇంట్లో ముగ్గురు అక్కాచెల్లెళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళల్లో మూడో అమ్మాయికి కాస్త అటూ ఇటూగా నా వయసుండచ్చు. వాళ్ళందరూ మధ్యాహ్నాలు వాళ్ళ వసారాలో కూర్చుని అష్టా చెమ్మా ఆడుతూ ఉండేవాళ్ళు. అమ్మమ్మతో పాటు తిరిగాక నాలుగురోజులకి ఆ చుట్టూ పక్కల వాళ్ళంతా ఫ్రెండ్స్ అయిపోయారు నాకు.

ఇంటికీ, మిల్లుకీ, హోటలుకీ, బడ్డీ కొట్టుకీ, అష్టా చెమ్మా ఆటకీ అన్నీటికీ బొంగరంలా తిరుగుతూనే ఉండేదాన్ని నేను. పగలంతా ఊరు మీద పెత్తనాలు చేసి సాయంత్రానికి ఇల్లు చేరాక మళ్ళీ అత్తయ్య తినడానికి ఏ అప్పచ్చులో పెట్టేది. ఇంకా మాకోసం అప్పట్లో మావయ్య తెచ్చిపెట్టిన బెల్లపు బూందీ మిఠాయి రుచి కూడా ఇప్పటికీ గుర్తే నాకు.

సాయంకాలం పూట వీధిలో గోళీ షోడా బండి వాడి కేక వినగానే చందూ గాడు భలే అల్లరి చేసేవాడు 'కీక్.. సోదా కాలీ' అంటూ. అప్పుడత్తయ్య మా అందరికీ షోడాలు కొనిచ్చేది. అలా సాయంకాలమంతా మేం ముగ్గురం అత్తయ్య కాళ్ళకడ్డం పడుతూ బాగా అల్లరి చేసి అలసిపోడం మూలాన రాత్రికి తొందరగానే బజ్జునేవాళ్ళం.

చందూతో ఆటలు, అత్తయ్యతో కథలూ కబుర్లూ, అమ్మమ్మతో తిరగడాలూ వీటన్నిటి సందట్లో రోజులెలా గడిచిపోయాయో తెలీనేలేదసలు. దాదాపు మేమొచ్చి నెల్లాళ్ళయిపోయి మళ్ళీ తిరిగి ఇంటికెళ్ళాల్సిన రోజు దగ్గరికి వచ్చేస్తోంది. ఇంతలో మావయ్య మా ఇద్దరికీ కొత్త బట్టలు కొనే బాధ్యత అమ్మమ్మకి అప్పగించాడు. అమ్మమ్మా, ఇంకా తన స్నేహితులూ, నేనూ, బాబిగాడూ అందరం కలిసి బస్సెక్కి వేరే ఊరెళ్ళాం బట్టలు కొనుక్కోడానికి.

బాబిగాడికో చొక్కా నిక్కరూ, నాకేమో పువ్వుల డిజైనున్న లేత గులాబీ రంగు శాటిన్ పరికిణీ. ఒట్టి పరికిణీనే కాదు, దానికి జతగా ముదురు గులాబీ రంగు ఓణీ కూడా కొన్నాం. అబ్బో.. ఆ వేళ నేనెంత మురిసిపోయానో చెప్పలేను. పెద్ద పిల్లలు వేసుకునే ఓణీ నాకప్పుడే వచ్చేసిందంటే ఎంత గొప్ప మరి!

మా ప్రయాణం రెండ్రోజుల్లోకి వచ్చింది. నా పరికిణీ కుట్టడానికి ఆ ఊర్లో ఉన్న ఒకే ఒక టైలరు దగ్గర ఇచ్చాం. మేము ఊరెళ్ళే లోపు ఇస్తాడో లేదోనని ఒకటే కంగారు నాకు. ఆ రెండ్రోజుల్లోనే ఓ ఇరవై ముప్పై సార్లు తిరిగి, ఆయన పక్కనే గంటల తరబడీ కూర్చుని, ఎలాగయితేనేం సమయానికి నా పరికిణీ చేతికందేలా చాలా కష్టపడ్డాను.

ఎలాగూ సిద్ధమయిపోయింది కదా అని రాధత్తయ్య ఎంచక్కా నాకు ఓణీ కట్టేసింది ఊరికి బయలుదేరేప్పుడు. ఇంతా చేసి మొదటిసారి ఓణీ వేసుకున్న సంతోషం లేనే లేదసలు నాకు. ఎలా ఉంటుంది మరి. అత్తయ్యా వాళ్ళందర్నీ ముఖ్యంగా చందూ గాడిని వదిలిపెట్టి మళ్ళీ మా ఊరెళ్ళి పోవాలిగా! అందుకని చాలా బెంగేసింది అప్పుడు.

నాకు బాగా గుర్తు. నేను ఓణీ వేసుకోడం వల్ల పెద్ద పిల్లననుకుని బస్సులో టిక్కెట్టుకి కూడా ఎక్కువ డబ్బులు తీస్కున్నారు ఆ రోజు. మరుసటి రోజు తెల్లారి మేం ఇల్లు చేరేసరికి అమ్మా వాళ్ళు ఒకటే ఆశ్చర్యపోయారు నా ఓణీ సింగారం చూసి.

"ఎందుకురా రవీ ఇవన్నీ?" అని అమ్మమ్మంటే "అదేంటి పెద్దమ్మా అలాగంటావూ.. నేనూ మేనమామనే కదా దానికి. రాక రాక నా ఇంటికొచ్చింది మొదటిసారి. తొమ్మిదో ఏడైనా ఓణీలు వెయ్యచ్చు ఆడపిల్లలకి అంది అమ్మ. ఏదో ముచ్చట కొద్దీ కొనిచ్చాలే!" అన్నాడు రవి మావయ్య. మమ్మల్ని దింపి ఆ మరుసటి రోజే మళ్ళీ ఊరెళ్ళిపోయాడు.

ఆ సెలవుల తరవాత రోజులూ, మాసాలూ గిర్రున తిరిగి మధ్యలో మరో ఎండాకాలం కూడా దాటిపోయింది. నా ఏడో క్లాసు కూడా అయిపోయింది. ఆ ఎండాకాలం సెలవల్లో చిన్న మావయ్య పెళ్ళికి రవి మావయ్యా, అమ్మమ్మా వచ్చారు ఊర్నుంచి. పెళ్ళి హడావిడిలో నాల్రోజులుండి వెంటనే వెళ్ళిపోయారు. ఆ తరవాత కొన్నాళ్ళకి మావయ్యా వాళ్ళకి ఇంకో బాబు పుట్టాడని కబురు తెలిసింది.

తరవాత మరో ఏడాదికి మావయ్య కొత్త ఇల్లు కట్టుకున్నాడని అమ్మా, నాన్నా వెళ్ళొచ్చారు. అప్పుడప్పుడూ అమ్మమ్మ కూడా వెళుతూనే ఉండేది, సావిత్రమ్మమ్మ ఇక్కడికి వస్తూ ఉండేది. అలా అలా నేను పదో తరగతిలోకొచ్చేశాను. నాన్న నన్ను బాబాయింటికి పంపించారు అక్కడుండి చదూకోడానికి. అక్కడ చదువూ, తమ్ముళ్ళతో కలిసి ఆటా పాటలతో ఆ ఏడాది కాస్తా క్షణంలా గడిచిపోయింది.

మళ్ళీ వేసవి కాలం సెలవులొచ్చాయి. అమ్మా, నేనూ అష్టాచెమ్మా ఆడుతూ ఏదో కబుర్లాడుతుంటే మధ్యలో ఏదో రవి మావయ్య మాటొచ్చింది. వాళ్ళందరూ ఎలా ఉన్నారని అడిగా అమ్మని. వాళ్ళ ప్రస్తావన రాగానే అమ్మ మోహంలో లీలగా ఏదో బాధ కనిపించింది. నేనింకా రెట్టించి సావిత్రమ్మమ్మ ఎప్పుడొస్తుందనడిగా.

దానికి అమ్మ చెప్పిన సమాధానం విని కాసేపు నోరు పెగల్లేదు నాకు. అయిదు నెలల క్రితమే సావిత్రమ్మమ్మ చనిపోయిందట. కడుపులో ఏదో పెద్ద సమస్య వచ్చిందట. వీళ్ళు గుర్తించి డాక్టరు దగ్గరికి వెళ్ళేసరికే చాలా ఆలస్యమయిపోయిందట. ఇంకెన్నో రోజులు మిగిలి లేవు అని చెప్పారట. యీ విషయం తెలీగానే మా అమ్మమ్మ ఊరెళ్ళి అక్కడే ఉందట చాలా రోజులు.

ఇక సావిత్రమ్మమ్మని మళ్ళీ చూసే అవకాశమే లేదని అర్ధమయ్యేసరికి నాకెంత ఏడుపొచ్చిందో చెప్పలేను. అమ్మ చాలాసేపు ఓదార్చింది. "మంచివాళ్ళకెప్పుడూ తక్కువ రోజులే ఉంటాయే భూమ్మీద. దేవుడెప్పుడూ మంచివాళ్ళని తొందరగా తీస్కెళ్ళి పోతాడని" బాధపడింది అమ్మమ్మ వాళ్ళ చెల్లిని తల్చుకుని.

ఆ తరవాత చాలా రోజుల దాకా ఆ విషయం మరచిపోలేకపోయాను. నేను వాళ్ళూరెళ్ళినప్పుడు అమ్మమ్మతో కలిసి చేసిన పనులన్నీ తరచూ గుర్తొస్తూ ఉండేవి. కంటికి కనిపించకపోయినా ఎక్కడో దూరంగానైనా అమ్మమ్మ ఎక్కడో ఉంది అనే అనిపించేది నాకు. ఇప్పటికీ అలానే అనిపిస్తుంటుంది.

ఆ తరవాత కొన్నాళ్ళకి ఓ రోజు ఎవరో రవి మావయ్య ఊర్లోంచి ఓ కబురు తెచ్చారు. అది విని మా ఇంట్లో వాళ్ళందరికీ దాదాపు గుండెలు పగిలినంత పనయ్యింది. రవి మావయ్య ఆత్మహత్యాయత్నం చేశాట్ట. అదృష్టవశాతూ ఎలాగో బతికి బయటపడ్డాడట. యీ విషయం గురించి ఇంట్లో పెద్దవాళ్ళెరూ మా ముందు మాట్లాడలేదు. అయినా, కొన్ని మాటలు నా చెవిన పడనే పడ్డాయి.

"ఎలాంటి మనిషి ఎలా అయిపోయాడే. మన రవేనా అని నమ్మలేకపోతున్నా! ఎంత సౌమ్యుడు, మెతక మనిషి! వాడిలా చేశాడంటే అస్సలు నమ్మకం కుదరట్లేదు. రాధని తనంత తానుగా ఇష్టపడి వాళ్ళింట్లో వాళ్ళని పెళ్ళికి ఒప్పించడానికి ఎన్ని తిప్పలు పడ్డాడు వాడు. దాని కోసం కాకపోయినా రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలు. వాళ్ళ మొహం చూసైనా వాడికి మంచీ చెడూ తెలీలేదా! బంగారం లాంటి కుటుంబాన్ని పెట్టుకుని ఇలా వేరే ఆడదాని వెంట పరుగు తీస్తాడని, ఎవరి కోసమో చావుకి సిద్ధపడతాడనీ కల్లో కూడా ఊహించలేదు. యీ రోజు వాళ్ళమ్మ బతికుంటే వీడు చేసిన పనికి ఇప్పుడే గుండాగి చచ్చేది. అందుకేనేమో అది అప్పుడే వెళ్ళిపోయింది!" అంటూ పాపం అమ్మమ్మ ఎంతో బాధగా ఏడ్చేస్తోంది. ఆ మాటలు వినగానే నాక్కూడా బుర్ర తిరిగిపోయింది. ఏమని ఆలోచించాలో కూడా తెలీలేదు.

ఆ తరవాత నా పదో తరగతి నుంచీ నేను ఇంటికి దూరంగా ఉండి చదువుకోడం మూలాన మరెన్నో విషయాలతో పాటు మావయ్య వాళ్ళ గురించి కూడా నాకు పెద్దగా తెలీలేదు. ఎవరి ప్రమేయం లేకుండానే రోజులు పరిగెడుతూనే ఉన్నాయి.

నా ఇంటరు రెండో సంవత్సరం అయిపోవస్తోంది. ఏవో సెలవులొస్తున్నాయని మా హాస్టలంతా హడావిడిగా ఉందా సమయంలో. ఎవరో పిలిచారు నన్ను చూడ్డానికి ఎవరో వచ్చారని. ఎవరా అని ఆలోచిస్తూ వెళ్ళేసరికి గేటు దగ్గర రవి మావయ్య! ఒకేసారి ఆశ్చర్యం, ఆనందం, బాధ అన్నీ కలగలిసిపోయిన ఓ వింత అనుభూతి. చాలా యేళ్ళయిందేమో చూసి, మనిషి కొంచెం మారినట్టనిపించింది. అయినా తన మోహంలో అదే చిరునవ్వు. నన్ను చూడగానే 'ఎలా ఉన్నావురా బుజ్జీ?' అన్నాడు. అచ్చం నా చిన్నప్పటిలాగే!

అమ్మమ్మ చెప్పిందట నేనిక్కడ చదువుతున్నానని. నాకు సెలవులు కదా అందుకని వాళ్ళూరికి తి సుకువెళతానన్నాడు. దగ్గరే కాబట్టి గంటన్నరలో వెళ్ళిపోవచ్చన్నాడు. నేనెళ్ళి బట్టలు సర్దుకొని వచ్చాక ఇద్దరం కలిసి బయల్దేరాం.

ఇప్పుడు వాళ్ళుండేది వేరే ఊర్లో. నే చిన్నప్పుడు వెళ్ళిన ఊరు కాదు. ఓ పక్క మామూలుగా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా గానీ నా బుర్రలో సవాలక్ష ఆలోచనలు తిరుగుతున్నాయి. అదీ ఇదీ మాట్లాడుతూ తొందరగానే ఇల్లు చేరాం.

నన్ను చూసి రాధత్తయ్య చాలా సంతోషించింది. కానీ, నాకే ఏదో బాధ తనని చూస్తే! దానికి తగ్గట్టు తను కూడా ఇంతకుముందంత అందంగా, ప్రశాంతంగా కనిపించలేదు నా కంటికి. అప్రయత్నంగానే నా కళ్ళు ఇల్లంతా తరచి చూశాయి. అంతలోనే జ్ఞాపకమొచ్చింది సావిత్రమ్మమ్మ ఇప్పుడీ ప్రపంచంలోనే లేదని.

ఆ దిగులు నన్నావరించేలోగానే ఓ చంటోడి అరుపులు వినిపించాయి. ఇంతలోనే అత్తయ్య వాడినెత్తుకొచ్చి నా చేతికిచ్చింది "వీడే తేజ.. వీడిని నువ్విదేగా మొదటిసారి చూడ్డం" అంటూ. భలే ముద్దుగా ఉన్నాడు వాడు. ఆ తరవాత కాసేపు అవీ ఇవీ మాట్లాడుకుంటూ ఉండగానే స్కూలుకెళ్ళిన చందూ వచ్చేశాడు. వాడికి నేను గుర్తు లేకపోయినా నాకు మాత్రం ఎంత సంబరంగా అనిపించిందో అన్నేళ్ళ తరవాత వాడిని చూడడం. ఎంత పెద్దయిపోయాడో వాడు. అప్పుడే మూడో తరగతట వాడు చదివేది.

మొదట్లో ఓ రెండ్రోజులు కొంచెం అదోలా అనిపించినా తరువాత అత్తయ్యతో ఒకటే కబుర్లు, పిల్లలతో ఆటల్లో పడి నాల్రోజులని వెళ్ళినదాన్ని దాదాపు పది రోజులున్నా మావయ్యా వాళ్ళింట్లో. రవి మావయ్యా వాళ్ళకి ఓ పెద్ద కిరాణా షాపుంది. అక్కడి నుంచి చాక్లెట్లు, బిస్కెట్లు, హార్లిక్సూ, ఏది కావాలంటే అది తెచ్చుకుని తినడం, అల్లరి చేయడం, ఆ పది రోజులూ ఇదే పని. ఆ ఇద్దరి చంటిపిల్లలతో పాటు నేనూ అల్లరి చేస్తూ గడిపేశాను. ఓ రోజు సాయంత్రం అందరం చందూగాడి స్కూల్ డే అని వెళ్ళాం. వాడికేదో బహుమతి కూడా వచ్చింది. అప్పుడప్పుడూ అమ్మమ్మని గుర్తు చేసుకునేవాళ్ళం. ఆ పది రోజులూ నాకు అచ్చంగా చిన్నప్పుడు నేను వాళ్ళింట్లో గడిపినప్పటిలాగే అనిపించాయి. కాకపోతే ఒకటే తేడా.. అదేంటంటే మావయ్య చిన్నప్పుడంత సరదాగా ఉండట్లేదిప్పుడు.

గతంలో రవి మావయ్య గురించి నేనేవో సంగతులు విన్నప్పటికీ మెల్లగా యీ పది రోజులు గడిచేసరికి నాక్కొంత ఊరటగా అనిపించింది. మళ్ళీ అన్నీ పరిస్థితులు చక్కబడ్డాయిలే అని కాస్తంత నమ్మకం కుదిరింది.

అప్పటికే నాకు చాలా రోజులు కాలేజీ పోవడం మూలాన మళ్ళీ మావయ్య నన్ను హాస్టలులో దింపడానికి తీస్కెళ్ళాడు. అత్తయ్య "మళ్ళీ ఎన్నేళ్ళకి చూస్తానో నిన్ను" అంటూ దిగులుగా నన్ను సాగనంపింది. ఇదివరకే అత్తయ్య నాకోసం ఓ జత బట్టలు కొనిచ్చిందన్నా వినకుండా ఓ పెద్ద షాపులోకి తీస్కెళ్ళి బలవంతం చేసి చాలా ఖరీదైన మరో డ్రస్సు కొనిచ్చాడు రవి మావయ్య. నన్ను హాస్టలు దగ్గర దింపి తను వెళ్ళిపోతుంటే ఎందుకో చాలా ఏడుపొచ్చింది. మావయ్య ఎంత మారాడనుకున్నా తన కళ్ళలో నా పట్ల అదే స్వచ్ఛమైన ప్రేమ కనిపించింది.. అచ్చం నా చిన్నప్పట్లాగే!

ఎప్పట్లాగే కాలమేఘం నిమిషాల్నీ, రోజుల్నీ, నెలల్నీ ఎడతెరిపి లేకుండా వర్షిస్తూనే ఉంది. ఆ వరదలోనే నా ఇంటరు చదువు అయిపోవడం, ఆ తరవాత డిగ్రీలో చేరడం, అది కూడా పూర్తి చేసి నేను ఎమ్మెస్సీలో చేరడం.. ఇవన్నీ నిమిషాల మీద జరిగాయా అన్నంత వేగంగా కాలప్రవాహంలో కొట్టుకుపోయాయి.

గడిచిన ఇన్నేళ్ళలోనూ అప్పుడప్పుడూ రవి మావయ్య వాళ్ళ గురించి ఆ నోటా యీ నోటా విన్నదే గానీ, అటూ ఇటూ రాకపోకలు బాగా తగ్గిపోయాయి. ఎప్పుడైనా మా ఇంట్లోవాళ్ళని తన గురించి అడిగితే ఏదో పొడి పొడిగా రెండు ముక్కలు చెప్పి ఊరుకుంటున్నారు. తన ప్రసక్తి వస్తే చాలు మా ఇంట్లో వాళ్ళందరూ మండిపడుతున్నారు. పోయిన అమ్మమ్మనీ, తన వల్ల బాధలు పడుతున్న రాధత్తయ్యనీ, పిల్లల్నీ గుర్తు చేసుకుని కంటతడి పెట్టుకుంటున్నారు.

మావయ్య గురించి వాళ్ళందరూ అంతగా విసిగిపోడానికి తగిన కారణమే ఉంది. అదేంటంటే, తను ఉన్నపళంగా అత్తయ్యనీ, పిల్లల్నీ వదిలేసి చెప్పా పెట్టకుండా మరో స్త్రీతో దేశాలు పట్టి పోవడం. రవి మావయ్య గురించి యీ విషయం తెలిసినప్పుడు నేనసలు నమ్మలేకపోయాను. కానీ, జరిగే వాస్తవానికి మన నమ్మకాలతో పని లేదుగా! మావయ్య అంతగా ప్రేమించిన అత్తయ్యనీ, పిల్లల్నీ వదిలి, ఎవరో భర్త పోయి ఓ పిల్లాడితో బతుకుతున్న మరో స్త్రీ పట్ల ఎలా ఆకర్షితుడయ్యాడా, ఆమె కోసం మొత్తం జీవితాన్ని ఎందుకు తల్లక్రిందులు చేసుకున్నాడా అనేది నాకిప్పటికీ అర్ధం కాని విషయం. అసలు అర్ధమే లేదేమోనిపించే విషయం కూడా!

అలా ఉన్నపళంగా షాపునీ, కుటుంబాన్ని వదిలేసిపోవడం మూలానా, భాగస్వాములు కాస్తా ఆ షాపుని స్వాధీనం చేసుకుని కూడా ఇంకా బోలెడన్ని అప్పులు చూపిస్తే, వాళ్ళకున్న ఏకైక ఆధారమయిన ఇల్లు కూడా అమ్మేసి, ఇద్దరు పిల్లల్నీ తీసుకుని వాళ్ళ పుట్టింటికి వెళ్ళిపోయిందట రాధత్తయ్య. జరుగుతున్నవన్నీ విని అందరి గుండె చెరువైపోవడమే తప్ప ఎవరూ ఏమీ చేయలేకపోయారు.

అమ్మమ్మ ఊరెళ్ళి రాధత్తయ్యని కలిసి మా ఊరు రమ్మని అడిగిందట. "ఎంతో సంతోషంగా మేము నలుగురం కలిసి మీ ఊరికి రావాలనుకున్నాం ఎప్పటికైనా.. అలాంటిది మీ అబ్బాయి నన్నిలాంటి పరిస్థితుల్లో పడదోశాడు. వచ్చి మీ అందరి మొహాలూ చూసే ధైర్యం నాకు లేదత్తయ్యా" అని బావురుమందట తను. ఏమనాలో తోచక అమ్మమ్మ తిరిగి వచ్చేసింది.

అప్పుడప్పుడూ ఆ నోటా యీ నోటా వాళ్ళ కబుర్లు తెలుస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు రవి ఎంత మంచివాడో అని పొగిడిన బంధువులందరూ ఇప్పుడు తన పేరెత్తితేనే మొహం చిట్లిస్తున్నారు. ఎక్కడో ఏదో ఊర్లో ఎవరికో కనిపించాడని ఒకరంటే, అసలు ఉన్నాడో పోయాడో అని మరొకరు.. ఇలా గాలి వార్తలతో బాధపడేవాళ్ళ మనసుల్ని మరింతగా గాయపరిచేవాళ్ళు మరి కొందరు. రాధత్తయ్య మాత్రం ఇవేమీ తనకి పట్టనట్టుగా ఉండటానికి ప్రయత్నిస్తూ తన పిల్లలని వృద్ధిలోకి తీసుకురావడమే ధ్యేయంగా పెట్టుకుని ఎన్నడూ అలవాటు లేనిదైనా పొలం పని, పాడి పని పెట్టుకుని ఎంతో కష్టపడుతోందట. వాళ్ళమ్మా నాన్నా తమ కూతురికి కల్లో కూడా ఊహించని దుస్థితి పట్టిందని క్రుంగిపోయినా, చివరికి చేసేదేం లేక తనకి కాస్త తోడుగా ఉంటున్నారట.

అలా మరి కొన్ని రోజులు గడిచిపోయి నా ఎమ్మెస్సీ కూడా పూర్తి కావొచ్చింది. మళ్ళీ ఎండాకాలం సెలవులొచ్చాయి. ఆ సెలవుల్లో మా బావ పెళ్ళి జరుగుతోంది. అందరం ఓ చోట కూర్చుని ఊరి నించి వచ్చిన చుట్టాలని పలకరిస్తూ కబుర్లు చెపుతున్నాం.

నేనూ, బాబిగాడూ ఏదో అనుకుని నవ్వుతుంటే, "బాగున్నావా బుజ్జీ..?" అని అన్నారు ఎవరో వెనక నుంచి. తిరిగి చూసిన నాకు నోట మాట పెగల్లేదు. ఆ వ్యక్తినే విస్తుపోయి చూస్తూ ఉండిపోయాను. బాబిగాడు కూడా నాలాగే బిత్తరపోయి చూస్తూ అస్పష్టంగా గొణుగుతున్నట్టుగా 'రవి మావయ్య' అన్నాడు.

మాకు తెలిసిన రవి మావయ్యకీ మేం చూస్తోన్న వ్యక్తికీ ఒక్క పోలిక కూడా కలవట్లేదనిపించింది. మనిషి చాలా లావైపోయాడు. మొహంలో మునుపటి కళా కాంతీ ఏవీ లేవు. ఏదో చెప్పలేని దైన్యత కనిపిస్తోంది ఆ కళ్ళలో.

అలా విభ్రాంతిగా చూస్తుండిపోయిన నేను మళ్ళీ "బాగున్నావా బుజ్జీ..?" అని తనడగడంతో యీ లోకంలోకొచ్చాను. "ఆఁ ఆఁ.. బానే ఉన్నా.." అన్నాను. తిరిగి నేనేమడగాలో తెలీట్లేదు నాకు. ఏం చేస్తున్నారని అడిగితే ఏదో పొడి పొడి సమాధానం చెప్పి ఊరుకున్నాం. "మిమ్మల్ని ఓసారి చూసి వెళ్దాం అని వచ్చాను బుజ్జీ...." అన్నాడు మావయ్య.

మా చుట్టూ ఉన్న చాలా మంది బంధువుల్లో ఏ ఒక్కరూ తనని గుర్తించినట్టు మొహం పెట్టలేదు. ఎవరూ పలకరించలేదు. నాకు మాత్రం తన దగ్గరగా కూర్చుని తనతో మాట్లాడాలని చాలా అనిపిస్తోంది మనసులో. కానీ, ఏం మాట్లాడాలో తెలీట్లేదు. తల దించుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాను. మనసంతా స్తబ్దుగా, భారంగా అయిపోయింది. అలాగే కాసేపు గడిచాక ఎవరో పిలిస్తే వెళ్ళాను. మళ్ళీ తిరిగి వచ్చేప్పటికి తనక్కడ లేడు. అమ్మావాళ్ళెవర్నీ కలవకుండానే వెళ్ళిపోయాడు. తరవాత తెలిసింది అసలు తననెవరూ పెళ్ళికి పిలవలేదని. తనంతట తనే ఎలాగో తెలుసుకుని వచ్చాడని.

ఆ రోజున అందరూ పెళ్ళి హడావిడిలో ఉన్నా గానీ నేను మాత్రం లోలోపలే చాలా మథనపడ్డాను రవి మావయ్య గురించి. తరువాత అమ్మా వాళ్ళతో తనొచ్చిన సంగతి చెపితే సర్లే అని ఊరుకున్నారు. మరి వాళ్ళకి మావయ్య మీదున్న కోపం అలాంటిది. నాకు మాత్రం ఆ పెళ్ళి రోజు తనని చూస్తే చెప్పలేనంత జాలేసింది. ఇంత జరిగినా తన మోహంలో ఇంకా ఏదో అమాయకత్వం కనిపించింది. తరువాత తనెప్పుడు గుర్తొచ్చినా ఆ రోజు నేను తనతో కాసేపు మాట్లాడాల్సింది అనిపించేది. నేనేం మాట్లాడకుండా ఎందుకలా ఉండిపోయానని నా మీద నాకే ఏదో అపరాధ భావన కలిగేది. అసలు ఎందుకిలా చేశావు మావయ్యా అని అడిగేస్తే బాగుండేదేమోననిపించేది. తనెప్పుడు జ్ఞాపకానికొచ్చినా ఏవేవో ఆలోచనలు, ప్రశ్నలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసి చివరికి ఆవేదనని మాత్రమే మిగిల్చేవి.

రోజుల లెక్కలో ఇంకో సంవత్సరం కరిగిపోయింది. ఈసారి నేను ఇంటికి మరింత దూరమైపోయాను దేశాంతరం వెళ్ళడం వల్ల. ఓ రోజు అమ్మ చెప్పింది ఫోనులో. మా ఇంకో బావ పెళ్ళికి రాధత్తయ్య వచ్చిందట ఊరునుంచి తేజాని తీస్కుని. చందూగాడు అప్పుడే కాలేజీలో చేరే వయసుకొచ్చాడట. పిల్లలు బాధ్యతగా చదువుకుంటున్నారని అమ్మ చెప్పింది విని చాలా సంతోషమేసింది. ఆ తరవాత మరి కొన్నాళ్ళ దాకా వాళ్ళ విషయాలేమీ తెలియరాలేదు.

ఓ రోజు నేనూ, బాబిగాడూ ఫోన్‌లో మాట్లాడుతుండగా ఏదో మాటల సందట్లో వాళ్ళ గురించి వచ్చింది. "అక్కా.. యీ మధ్య రవి మావయ్య తను చేసిందంతా చాలా పెద్ద తప్పని రియలైజ్ అయ్యాడట. తిరిగి అత్తయ్యా వాళ్ళ దగ్గరికొచ్చేస్తానన్నాడట. పిల్లల బాధ్యత కూడా తీసుకుంటానన్నాడట. ఇప్పటికైనా ఇంగితం తెలిసొచ్చిందని పెద్దవాళ్ళందరూ సంతోషించారు" అని ఓ క్షణం ఆగాడు.

వాడి మాటలు వింటుంటే నాకెంత సంతోషమనిపించిందో! "ఎలాగైనా మళ్ళీ వాళ్ళ కుటుంబం అంతా ఓ గూటి కిందకి వస్తారు. మళ్ళీ మా చిన్నప్పటి మావయ్యని చూడొచ్చు" ఇలా రకరకాల ఆలోచనలు నన్ను ముసురుకుంటుండగానే బాబిగాడు మళ్ళీ చెప్పడం కొనసాగించాడు. "కానీ.. దురదృష్టం! తను చేసిన తప్పుని సరిదిద్దుకునే సమయానికి అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చి చనిపోయాడక్కా మన రవి మావయ్య! ఇది జరిగి నాలుగైదు నెలలయినా నాకీ మధ్యనే తెలిసింది" అని ఇంకా ఏదో చెప్తున్నాడు బాబిగాడు.

కానీ, అప్పటికే నా మెదడు మొద్దుబారిపోయి ఆ తరువాత వాడు మాట్లాడుతున్న మాటలేవీ నా చెవులని చేరలేకపోయాయి. నా ప్రమేయం లేకుండానే నా కళ్ళల్లోంచి నీళ్ళు చిప్పిల్లాయి. నేను చివరిసారి తనని చూసినప్పుడు సరిగా మాట్లాడలేదనే బాధ మళ్ళీ నన్ను కమ్ముకుంటోంది. దుఃఖంతో గొంతు పూడుకుపోయి మాట పెగల్లేదు నాకు.

నాకెంతో ఇష్టమైన మా రవి మావయ్య జీవితం ముప్పై అయిదేళ్ళు కూడా నిండక ముందే అర్ధాంతరంగా ముగిసిపోయిందనేది వాస్తవమని తెలుస్తున్నా కూడా, తన గురించి విన్న అన్నీ విషయాల్లాగే యీ చేదు నిజాన్ని కూడా నాకు అస్సలు నమ్మాలనిపించలేదు!

●●●

Click here to share your comments on this story